క్లుప్తంగా

9న ఆలయాల్లో ఉగాది వేడుకలు

నెల్లూరు(బృందావనం): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన సింహపురి గ్రామదేవత శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారు, మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, కరెంటాఫీస్ సెంటర్ వద్దనున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, హోమాలు, ఉత్సవాలు, సేవలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు బొగ్గల మల్లికార్జునరెడ్డి, ఆరంబాకం వేణుగోపాల్, జె.వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివార్లను దర్శించుకోవాలని కోరారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న ఈఈ సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు టౌన్ డివిజన్ విద్యుత్ సెక్షన్ కార్యాలయాల పరిధిలో ప్రతి నెలా ఒక అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో తన చాంబర్‌లో శనివారం నెల్లూరు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అకౌంట్స్ ఆఫీసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ డివిజన్‌లో రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని, మూడు నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులను తొలగించాలని ఆదేశించారు. లోఓల్టేజీ సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత ఏఈలపై ఉందన్నారు. నెల్లూరు టౌన్ డివిజన్ పరిధిలో 350 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతి పోలింగ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉందో లేదో సంబంధిత ఏఈ పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్‌రెడ్డి, కిరణ్, ఏఈలు, జేఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'రంగడి' హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక క్లాత్ హుండీలు, పర్మినెంట్ హుండీల్లోని కానుకలను లెక్కించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు భక్తులు స్వామివారికి రూ.8,24,668 కానుకలను సమర్పించారని తెలిపారు. హుండీ కానుకల లెక్కింపు పర్యవేక్షణాధికారిగా దేవదాయ, ధర్మాదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్ వ్యవహరించారని తెలిపారు.

అన్నప్రసాద వితరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో శనివారం శ్రీత్యాగరాజ స్మరణోత్సవాల ముగింపు సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. గత వారం రోజులుగా బిక్షాటనాపూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు పాల్గొని త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు కమిటీ శాశ్వత ప్రధాన కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్ తెలిపారు.

సొసైటీ బ్యాంకుల కంప్యూటరీకరణకు చర్యలు

• జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి

ఉదయగిరి: జిల్లాలోని సొసైటీ బ్యాంకులన్నిటినీ కంప్యూటీకరణ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి కె.తిరుపతయ్య తెలిపారు. ఆయన శనివారం ఉదయగిరి పట్టణంలోని కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో జరుగుతున్న కంప్యూటరీకరణ పనులు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరిస్తున్నామన్నారు. త్వరలో సొసైటీలకు కంప్యూటర్లు అందించి నెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులురెడ్డి, ఆడిటర్ కె.సుబ్రహ్మణ్యం, సీఈఓలు పోలయ్య, రత్తయ్య, సుబ్బారెడ్డి, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చేజర్ల: ఓ వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కోటితీర్థం వెంకయ్యస్వామి ఆశ్రమంలో శుక్రవారం రాత్రి జరిగింది. జలదంకి మండలం బ్రాహ్మణక్రాకకు చెందిన పాలవెల్లి కోటారెడ్డి (81)కి ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య చాలా కాలం క్రితం మృతి చెందింది. దీంతో ఆయన ఐదేళ్లుగా కుటుంబాన్ని వదిలేసి కోటితీర్థంలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఉంటూ జీవనం గడుపుతున్నాడు.వయోభారం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్సై ప్రభాకర్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అడుగడుగునా జననీరాజనం


బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

• సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టిన ప్రజలు
• సింహపురి సర్కిల్‌లో జనసందోహం
• జయహో జగన్ అంటూ నినాదాలు
• ప్రజలతో మమేకమైన ముఖ్యమంత్రి

నెల్లూరు(పొగతోట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 9వ రోజు బస్సు యాత్ర నెల్లూరు రూరల్‌లోని చింతారెడ్డిపాళెం వద్ద క్యాంపు నుంచి శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. సింహపురి హాస్పిటల్ సర్కిల్ అప్పటికే జనంతో కిక్కిరిసిపోయింది. జయహో జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. సీఎం బస్సు నుంచి దిగి ప్రజల వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరించారు. ఆయనతో కరచాలనం చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. సీఎం బస్సు యాత్ర సింహపురి హాస్పిటల్ సమీపంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ నాయకుడు నన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పలువురు తమ సమస్యలపై సీఎంకు వినతిపత్రాలు అందజేశారు. నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జబర్దస్త్ రియాజ్‌ను సీఎం ఆప్యాయంగా పలకరించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఎండను సైతం లెక్క చేయకుండా..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం నెల్లూరురూరల్ నియోజకవర్గం చింతారెడ్డిపాళెం నుంచి ఆయన కావలికి బయలుదేరారు. ఆయనకు స్వాగతం పలికేందుకు నగరంలోని 53, 54 డివిజన్లకు చెందిన మహిళలు, చిన్నారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భగత్‌సింగ్‌కాలనీ వద్ద జాతీయ రహదారి పొడవునా పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మేమంతా సిద్ధం అన్న పోస్టర్లతో పెద్ద సంఖ్యలో వేచి ఉన్న ప్రజలను చూసిన ముఖ్యమంత్రి తాను ప్రయాణిస్తున్న బస్సును ఆపి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఎండను సైతం లెక్కచేయకుండా తనపై అభిమానంతో ఎదురుచూసిన ప్రజలను చూసి ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.


జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


సింహపురి హాస్పిటల్ సర్కిల్‌లో సీఎం రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

మర్యాదపూర్వకంగా..


ముఖ్యమంత్రిని కలిసిన మేయర్ స్రవంతి దంపతులు


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట/బారకాసు): మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చింతారెడ్డిపాళెం వద్ద బస చేసిన ప్రాంతంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి – జయవర్ధన్ దంపతులు శనివారం మర్యాదపూరక్వంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎన్నికల ప్రచారం బాగా నిర్వహించాలని సీఎం వారికి సూచించారు. అలాగే ముఖ్యమంత్రిని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కావలి వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభ సందర్భంగా ఆయనను కలిసి పార్టీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.


ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న జీవీ ప్రసాద్


సీఎం జగనన్నతో మాట్లాడుతున్న మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి

నేడు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సదస్సు

నెల్లూరు(లీగల్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆత్మీయ సదస్సు ఆదివారం ఉదయం 9 గంటలకు నెల్లూరులోని రామమూర్తినగర్‌లో ఉన్న రామచంద్ర (బాల పీరయ్య) కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డిని కలిసి సదస్సుకు ఆహ్వానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సుకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అలాగే నెల్లూరురూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలోని న్యాయవాదులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


విజయసాయిరెడ్డిని సదస్సుకు ఆహ్వానిస్తున్న రోజారెడ్డి

పీఏసీఎస్‌ల తనిఖీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న పీఏసీఎస్‌లను జిల్లా సహకారశాఖ అధికారి గురప్ప శనివారం తనిఖీ చేశారు. మర్రిపాడు మండలంలోని భీమవరం, అనంతసాగరం పీఏసీఎస్‌లను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా సంఘాల్లో కంప్యూటీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, కామన్ సర్వీసు కేంద్రాల వద్ద సభ్యులకు ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లింపులు చేయాలని సూచించారు. కలువాయి సంఘం పరిధిలో జొన్నల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు, కనీస మద్దతు ధరపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, సంఘాల్లో బకాయిల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంఘాల సభ్యులకు సకాలంలో పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహకారశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీఈఓలు మల్లికార్జునరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.


భీమవరం పీఏసీఎస్‌లో తనిఖీ చేస్తున్న డీసీఓ గురప్ప

వాహన పార్కింగ్ ఏర్పాటు చేయండి

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రామలింగాపురం అండర్‌బ్రిడ్జి నుంచి హరనాథపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రోడ్డుకు ఒకవైపు పచ్చదనం ఉండేలా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. రోడ్డు మధ్యలో ప్రణాళికాబద్ధంగా వాహన పార్కింగ్ జరిగేలా సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డును ఆక్రమిస్తూ విక్రయాలు జరిపే ప్రదేశంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రోడ్డు మార్జిన్ వ్యాపారులు హద్దు దాటకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, శానిటేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

టీడీపీ నేత భూ ఆక్రమణ

• అధికారులకు ఫిర్యాదు

తోటపల్లిగూడూరు : ఓ టీడీపీ నేత ఆక్రమణల నుంచి తన భూమిని విడిపించాలని తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం, ఏరూరు గ్రామానికి చెందిన పూడిపర్తి సుధాకర్‌రెడ్డి శనివారం తహసీల్దార్ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వరిగొండ పంచాయతీ సర్వే నంబరు 584లో 98 సెంట్లు, సర్వే నంబర్ 585లో 91 సెంట్ల పట్టా భూమి ఉందన్నారు. దీని పక్కన నెల్లూరుకు చెందిన ఓ టీడీపీ నేత గోల్డెన్ సిటీ పేరుతో వెంచర్ వేశాడన్నారు. ఈ క్రమంలో తన 98 సెంట్ల భూమిని అందులో కలిపేసుకునే ప్రయత్నం చేయగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముళ్లకంచె ఏర్పాటు చేశానన్నారు. దీనిపై లేఅవుట్ వారు కోర్టుకు వెళ్లడంతో స్టేటస్‌కో ఇచ్చిందన్నారు. అయితే కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా లేఅవుట్ వారు ఫెన్సింగ్ రాళ్లను కూల్చివేశారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే సదరు టీడీపీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.


ఫెన్సింగ్ రాళ్లను కూల్చేసిన దృశ్యం

వృద్ధురాలిపై హత్యాయత్నం


తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు

నెల్లూరు(క్రైమ్): మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై విచక్షణారహితంగా రాడ్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సేకరించిన సమాచారం మేరకు.. నగరంలోని రామ్‌నగర్ ఒకటో వీధిలో విజయమ్మ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు శనివారం ఆమె ఇంట్లోకి ప్రవేశించి కత్తితో దాడికి యత్నించాడు. ఆమె తప్పించుకుంటుండగా పక్కనే ఉన్న రాడ్‌తో ఆమె తలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. గాయాలపాలైన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వృద్ధురాలి కుటుంబసభ్యులు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన యువకుడు స్థానికంగా టిఫిన్ అంగడి నిర్వహిస్తున్న హసీనా అనే మహిళ కుమారుడని స్థానికులు పేర్కొంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. కపాడిపాళేనికి చెందిన నెహేమియా(22) డిగ్రీ చదివి సంగీతం నేర్చుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి ఆయన స్కూటీపై మాగుంటలేఅవుట్ లెక్చరర్‌కాలనీలోని పార్కు వద్ద వెళుతుండగా ఓ కారు ఆయనను వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయాలపాలైన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈమేరకు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.25 లక్షలకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్


మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీలో నిజమైన నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని, ఎమ్మెల్యే టికెట్ రూ.25 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దుకూరు రమేస్‌నాయుడు ఆరోపించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తి సోము అనిల్‌కుమార్‌రెడ్డి వద్ద రూ.25 లక్షలు తీసుకుని ఉదయగిరి పార్టీ టికెట్ ఇచ్చారని, ఈ విషయం అనిల్‌కుమార్‌రెడ్డి తనకు స్వయంగా చెప్పాడని, అందుకు తగ్గ ఆధారాలు కూడా ఉన్నాయని తెలిపారు. అనైతికంగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మా బాధ జగనన్నకు చెప్పుకున్నాం

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని సంతపేటకు చెందిన నాగలప్పగారి కోటేశ్వరరావు దంపతులు ముఖ్యమంత్రి జగనన్నకు తమ కష్టాలు చెప్పుకున్నామని తెలిపారు. చింతారెడ్డిపాళెం వద్ద క్యాంపులో శనివారం వారు ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు బొమ్మప్పకు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైందని, మెరుగైన వైద్యం కోసం ఆదుకోవాలని కోటేశ్వరరావు దంపతులు ముఖ్యమంత్రిని కోరారు.


తమ సమస్యను జగనన్నకు చెప్పుకున్నామంటున్న కోటేశ్వరరావు దంపతులు

రాజన్న విగ్రహావిష్కరణకు రావాలన్నా

• ఏలూరు జిల్లావాసుల విజ్ఞప్తి

నెల్లూరు(దర్గామిట్ట): ఏలూరు జిల్లా కొయ్యగూడెం మండలం సరిపల్లి గ్రామంలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేశామని, విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ ఏలూరు జిల్లావాసులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బస్సుయాత్రలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి శనివారం కావలిలో జరిగిన మేమంతా సిద్ధం సభకు బస్సులో వెళుతుండగా నగరంలోని చింతారెడ్డిపాళెం వద్ద వారు ప్లకార్డులు ప్రదర్శించి విజ్ఞప్తి చేశారు.


విగ్రహావిష్కరణకు రావాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏలూరు జిల్లావాసులు

సమాచార కరపత్రం ఆవిష్కరణ

నెల్లూరు(టౌన్): ఎస్టీయూ రూపొందించిన సమాచార స్రవంతి కరపత్రాలను శనివారం నగరంలోని దర్గామిట్టలో ఉన్న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జేడీ సర్వీసెస్, 10వ తరగతి మూల్యాంకనానికి జిల్లాకు నియమితులైన ప్రత్యేకాధికారి మువ్వా రామలింగం, జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి జి.రాజమనోహర్, రాష్ట్ర కౌన్సిలర్ కె.కృష్ణ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.సుమన్, వీరాస్వామి, టి.ఆసనయ్య, కావలి ఉప విద్యాశాఖాధికారి దశరథరామయ్య తదితతరులు పాల్గొన్నారు.



ఆరుతడి పంటలు లాభదాయకం

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి సూచించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో ఆరుతడి పంటలైన వేరుశనగ, నువ్వులు, మొక్కజొన్న, జొన్న, సజ్జ, మినుము, పెసర వంటి పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆరుతడి పంటల సాగుపై వచ్చే వారం నుంచి రైతుభరోసా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి

కిడ్జిలో గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు(టౌన్): మౌంట్ లిటరా కిడ్జి స్కూల్ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మౌంట్ లిటరా కిడ్జి స్కూల్ చిల్డ్రన్ పార్క్ బ్రాంచ్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. తొలుత చిన్న పిల్లలు తమ ఆటపాటలతో అలరించారు. సెల్ఫీ కార్నర్ ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. కార్యక్రమంలో విద్యాసంస్థల కోఆర్డినేటర్ దినేష్, ప్రిన్సిపల్ రూపశ్రీ, కిండర్ గార్డెన్ ఇన్‌చార్జి ప్రభ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బైక్ అదుపుతప్పి ..

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు సమీపంలో శనివారం జరిగింది. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన మున్వర్ పని నిమిత్తం కనుమూరుకు వెళ్తుండగా, కనుపూరు సమీపంలో టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.